క్లుప్తంగా

వ్యవసాయ శాఖ బాధ్యతలను తప్పించండి

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామ ఉద్యాన సహాయకులకు వ్యవసాయ శాఖ బాధ్యతల నుంచి మినహాయింపు ఇవ్వాలని వీహెచ్ఏలు డిమాండ్ చేశారు. సోమవారం వారు ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవిని కలిసి వినతి పత్రం సమర్పించారు. తాము ఉద్యాన శాఖకు చెందిన వారమైనప్పటికీ వ్యవసాయ అధికారులు పెత్తనం చెలాయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ బాధ్యతల నుంచి తమను విముక్తులను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వీహెచ్ఏలందరు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల కోసం తప్పని నిరీక్షణ


ఏడీ బిల్డింగ్ వద్ద వేచి ఉన్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: విద్యార్హత ధ్రువపత్రాల కోసం రాయలసీమ వర్సిటీ ఏడీ బిల్డింగ్ వద్ద విద్యార్థులకు నిరీక్షణ తప్పడం లేదు. వర్సిటీ పరీక్షల విభాగం నుంచి సకాలంలో విద్యార్హత ధ్రువపత్రాలు సంబంధిత కళాశాలలకు చేరక పోవడం, విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నా సకాలంలో ఇవ్వక పోవడంతో వర్సిటీ వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్, పోటీ పరీక్షల షెడ్యూల్స్ విడుదల కావడంతో మార్క్ లిస్ట్ జాబితా, ప్రొవిజినల్, కాన్వకేషన్ తదితర సర్టిఫికెట్ల కోసం వర్సిటీకి రావడం తప్పడం లేదు. ఉన్నతాధికారులను కలిసి సమస్య విన్నవించుకుందామంటే సెక్యూరిటీ సిబ్బంది ఏడీ బిల్డింగ్‌లోకి అనుతించడం లేదు. వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి సర్టిఫికెట్లు సకాలంలో అందేలా చూడాలని వేడుకుంటున్నారు.

జిల్లా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: జిల్లా గ్రంథాలయంలో సోమవారం సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. డ్రాయింగ్ మాస్టర్ సుందర్రాజు, ఆర్‌డీటీ ఉపాధ్యాయులు దామోదర్‌రావు, గో పాలకృష్ణ, మద్దిలేటి హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేందుకు సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలను నిర్వహించడంతో వారిలో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క మాట్లాడుతూ జూన్ 6వ తేదీ వరకు క్యాంప్ జరుగుతుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు(రూరల్): జిల్లా వాల్మీకి(బోయ) ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. కర్నూలు మండల పరిషత్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పనిచేస్తున్న డా. బోయ మల్లన్న, జనరల్ సెక్రటరీగా అదోనికి చెందిన టీచర్ సుధాకర్ బాబుని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


ఎంపీటీసీని పరామర్శిస్తున్న కాటసాని

కల్లూరు : బస్తిపాడు ఎంపీటీసీ నాగేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న నంద్యాల వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోమవారం ఆసుపత్రికి చేరుకుని నాగేశ్వరరావును పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

సాక్షి సినిమాలు



ఎస్వీసీ కాంప్లెక్స్ : అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి, జింఖానా, సారంగపాణి జాతకం, అన్‌టిల్ డాన్, నెరఘా 2, తుడరుం
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : సారంగపాణి జాతకం, అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి, తుడా రుం, జింఖానా, అన్‌టిల్ డాన్, సోదర (ఇట్స్ రొమాంటిక్ స్టోరీ), చౌర్య పాటం, ఓదెల 2
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: సారంగపాణి జాతకం, అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి, జింఖానా
శ్రీరామ : అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
రాజ్ : తుడారుం
భరత్ కాంప్లెక్స్ : చౌర్య పాటం, ఏఎల్‌సీసీ (ఓ యూనివర్సల్ బ్యాచిలర్)

నృత్యం.. నవ్య తేజం!

- నృత్యం నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్న యువత
- అందుబాటులో సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులు
- నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం


కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నృత్యం చేస్తున్న దృశ్యం (ఫైల్)

కర్నూలు కల్చరల్: 'సత్ జ్ఞానం సత శిల్పనం ససా విద్య ససా కళ ససాయోగో సత్ కార్య నాట్యేస్మిన్ యనదృశ్యత్' అంటే జ్ఞానం, శిల్పం, విద్య , కళ, యాగం కలిగిన సర్వ సంపన్నమైన కళ నాట్యం. హావభావాలకు లయను, సంగీతాన్ని జోడించి ఆబాల గోపాలాన్ని అలరించే ఈ కళ సామాజిక దృక్పథాన్ని, పురాణ ఇతిహాసాలను మంచి చెడులను ప్రచారం చేయడానికి ఎంతో ఉపయోగపడుతుంది. నేడు అంతర్జాతీయ నాట్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

సర్వతోముఖ వికాస సాధనం


శాస్త్రీయ నృత్య రీతులు భారతీయ సంస్కృతికి ప్రతిరూపాలు. నవరసాల్లో ఒదిగిన ఈ నాట్య కళ మనిషి సర్వోతముఖ వికాసానికి సాధనం. నాట్యం చేస్తున్నప్పుడు కళాకారులు ప్రపంచాన్ని మరచిపోతారు. ధ్యానంతో ఎలాంటి అనుభూతి పొందుతారో అదే స్థితి నృత్యం ద్వారా లభిస్తుంది. ఈ కళ సాధన చేసిన వారిలో ఏకాగ్రత, ఆత్మస్థైర్యం, పట్టుదల ముఖ్యంగా జ్ఞాపక శక్తి పెరుగుతుందని పలు పరిశోధనల్లో వె వెల్లడైంది. నృత్యాన్ని మించిన వ్యాయామం లేదంటున్నారు నిపుణులు. నిత్యం ఓ గంట పాటు నృత్య సాధన చేస్తే జిమ్, ఏరోబిక్స్ అవసరమే లేదంటున్నారు.

పెరుగుతున్న శిక్షణ సంస్థలు

నృత్యం కొందరికి సర్వస్వం. మరికొందరికి జీవనోపాధి. ఇంకొందరికి సరదా. మొత్తం మీద సంప్రదాయ నృత్య కళలకు ఆదరణ నానాటికీ పెరుగుతోంది. అదే సమయంలో ఆధునిక నృత్యాలపైనే ఆసక్తి పెరుగుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెరుగుతున్న నృత్య శిక్షణ కేంద్రాలే దీనికి నిదర్శనం. ఆసక్తిగా నేర్చుకుంటున్న వారిలో చిన్ని పిల్లలు, యువత, ముఖ్యంగా మహిళలు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. ఉద్యోగులు, గృహిణులు సైతం ఉత్సాహంగా నేర్చుకొని ప్రదర్శనలు ఇస్తున్నారు. నృత్యం పట్ల ఆసక్తి పెరుగుతుండటంతో జిల్లాలో ఉదయం సాయంకాలాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాల రాయలసీమలోనే ఏకైక శిక్షణ కేంద్రం. ఇక్కడ సంగీతంతో పాటు శాస్త్రీయ నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఈ కళాశాలలో వివిధ జిల్లాల విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. కర్నూలుతో పాటు నంద్యాల, ఆదోని, డోన్, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, మంత్రాలయం, కోడుమూరు ఇలా అన్ని పట్టణాల్లో నృత్య శిక్షణ కేంద్రాలు వెలిశాయి. వేసవి సెలవుల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. వారంతాల్లో కూడా తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. సరదాగా నేర్చుకునే వారు ఆధునిక రీతులపైనే ఆసక్తి చూపుతున్నారు. టీవీ గేమ్ షోల్లో పాల్గొనాలన్న ఆసక్తితోనే ఎక్కువ మంది స్వల్ప కాలిక కోర్సుల్లో చేరి శిక్షణ పొందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో నృత్య శిక్షణ కేంద్రాలు	180
కర్నూలు నగరంలో	25
ప్రభుత్వ నృత్య కళాశాలలో కోర్సులు	4 ఏళ్ల సర్టిఫికెట్ కోర్సు, 2 ఏళ్ల డిప్లమా కోర్సు
ప్రైవేట్ శిక్షణ కేంద్రాల్లో..	
సంప్రదాయ నృత్యం	ఏడాది కోర్సు
పాశ్చాత్య నృత్యం	3 నెలలు

శాస్త్రీయ కళలపై ఇష్టంతో..



నాకు శాస్త్రీయ కళలు సంగీత, కూచిపూడి నృత్యం అంటే చాలా ఇష్టం. పెళ్లైన తరువాత నా ఇష్టాన్ని గమనించిన నా భర్త వాటిని నేర్చుకోడానికి ప్రోత్సహించారు. కర్నూలు ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాలలో చేరి కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యం నేర్చుకొని సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేశాను. ప్రస్తుతం డిప్లమా చేస్తున్నాను. అనేక నృత్య ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖులచే ప్రశంసలు అందుకున్నాను.

– ఎల్. అనిల, కర్నూలు


సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సంప్రదాయ నృత్యాలు ప్రత్యేకం



సంప్రదాయ నృత్యాలు ఎప్పటికైనా ప్రత్యేకమే. ఎక్కువ మంది కూచిపూడి, భరతనాట్యం నేర్చుకోడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. ఎన్ని ఆధునిక నృత్యాలు వచ్చినా సంప్రదాయ నృత్యాలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. లయ బద్ధంగా నృత్యం చేయడంతో నవనాడులు ఉత్తేజితమవుతాయి. శారీరక, మానసిక ఉల్లాసానికి దోహద పడుతుంది.

– నారాయణ స్వామి, నృత్య శిక్షకులు, కర్నూలు

నృత్యంతో ఏకాగ్రత,మానసికోల్లాసం



నృత్యంతో సర్వతో ముఖ వికాసం కలుగుతుంది. ఇందులో సర్వ కళలు మిళితమైనవి. నృత్యం వల్ల సంగీతం, సాహిత్యం, లయ, అభినయం పై అవగాహన కలుగుతుంది. ఏకాగ్రతతో పాటు మానసికోల్లాసం, మంచి శరీర ధారుడ్యం ఏర్పడుతుంది. ఇటీవల కాలంలో నృత్యం నేర్చుకునే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఆధునికతకు అనుగుణంగా మన నృత్యాల్లో చాలా మార్పులు వస్తున్నాయి. శాస్త్రీయ నృత్యానికి ఎప్పటికి ఆదరణ ఉంటుంది. మన శాస్త్రీయ నృత్యాలు ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి పొందాయి.

– మునికుమార్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ శారదా సంగీత, నృత్య కళాశాల, కర్నూలు

చిన్నతనం నుంచే



నేను ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాను. చిన్నతనం నుంచే కూచిపూడి అంటే ఇష్టంతో నేర్చుకున్నాను. రాష్ట్ర జాతీయ స్థాయిలో నృత్య ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖులతో ప్రశంసలు అందుకున్నాను. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదైంది. నృత్యం నేర్చుకోవడం ద్వారా ఏకాగ్రత పెరగడంతో పాటు రోజంతా ఉత్సాహంగా గడుపుతాం. దీంతో చదువులోనే ఉన్నతంగా రాణించేందుకు దోహద పడింది.

– లింగాల వాసుకి, ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం

విలువలతో కూడిన విద్య అవసరం


డీఈఓ శామ్యూల్ పాల్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

కర్నూలు (సిటీ) : విలువలతో కూడిన విద్య ఉన్నత స్థాయికి చేర్చుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.శామ్యూల్ పాల్ అన్నారు. సోమవారం నగరంలోని బీఏఎస్ కల్యాణ మండపంలో ఐడెల్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో తక్మీల్ ఎ తహఫిల్ ఖురాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య, నైపుణ్యం, క్రీడలపై పట్టు సాధించాలన్నారు. విద్య నేర్చుకోవడంతో పాటు మహనీయుల జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డీఈఓను సత్కరించారు. కార్యక్రమంలో క్లస్టర్ వర్సిటీ అకడమిక్ డీన్ అక్తర్ భాను, కరస్పాండెంట్ అమీర్ అజీజ్, బ్రైట్ ఫౌండేషన్ అధ్యక్షుడు, న్యాయవాది మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులకు కలెక్టర్ ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్) : మే 4వ తేదీన నిర్వహించే నీట్ యూజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం నీట్ యూజీ పరీక్షపై కలెక్టర్ చీఫ్ సూపరింటెండెంట్‌లు, సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మే 4వ తేదీన కర్నూలులో నగరంలో 16 కేంద్రాల్లో నిర్వహించే నీట్ యూజీ పరీక్షకు 446 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం నుంచి 5 గంటల మధ్య పరీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లలో లోపం లేకుండా చూడాలని సూచించారు. ఒక్కో పరీక్ష కేంద్రం వద్ద నాలుగురు పోలీసులను ఉంచాలని, ప్రశాంతం వాతావరణం కోసం 1 బీఎన్ఎస్ఎస్ సెక్షన్‌ను విధించాలని తహసీల్దార్లను ఆదేశించారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. కేంద్రాల వద్ద దివ్యాంగుల కోసం వీల్‌చైర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, నోడల్ అధికారి పాయల్ ప్రియదర్శిని, డీఎస్పీ బాబు ప్రసాదు, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావుజు పాల్గొన్నారు.

30న పాలిటెక్నిక్ ఎంట్రెన్స్

కామన్ పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 30వ తేదీన నిర్వహించే కామన్ పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ పరీక్ష కోసం జిల్లాలో 22 సెంటర్లలో 7,352 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని, కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమంచవద్దని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ విజయశ్రీ, పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీధర్, కర్నూలు రూరల్, అర్బన్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమించారు

కర్నూలు (టౌన్) : స్టాంటన్‌పురంలో రహదారి ఆక్రమణతో మురుగు నీరు ఎక్కడికక్కడ ఆగిపోయి ఇబ్బందులు పడుతున్నట్లు అదే కాలనీకి చెందిన మరియమ్మ కమిషనర్ రవీంద్రబాబుకు విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీల నుంచి వచ్చిన పలువురు సమస్యలపై అర్జీలు అందజేశారు. వాటిని కమిషనర్ పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ, మున్సిపల్ ఎస్ఈ రాజశేఖర్, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

ఫిర్యాదుల్లో కొన్ని...

- పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలని రిచ్మండ్ హోమ్స్ కాలనీకి చెందిన పి.వి. రామరాజు కోరారు.
- వీధి దీపాలు వెలగడం లేదని వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన చిన్న చంద్రయ్య, రాజు, రాములమ్మ విన్నవించారు.
- 24 మంది పారిశుద్ధ్య కార్మికులకు 6 నెలలుగా వేతనాలు అందడం లేదని కేఎంసీ వర్కర్స్ యూనియన్ నాయకులు వైవీ రమణ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

మత్తుకు బానిసై జీవితం నాశనం చేసుకోవద్దు


మత్తుకు బానిస కావద్దంటూ విద్యార్థులతో పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఈగల్ సెల్ టీమ్

కర్నూలు : మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈగల్) ఎస్ఐ కె.సృజన్ కుమార్ విద్యార్థులకు సూచించారు. జిల్లా యాంటీ నార్కోటిక్ టీమ్, ఈగల్ సెల్ ఆధ్వర్యంలో సిస్టర్ స్టానిస్లాస్ స్కూల్‌లో సోమవారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల అనర్థాలు, చట్టాల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ దుష్పరిణామాలను విద్యార్థులకు వివరించారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా రక్షించడం ఎలా అనే అంశంపై వివిధ రూపాల్లో అవగాహన కల్పించారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాల రవాణా, వినియోగం జరుగుతున్నట్లు తెలిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 1972కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. మత్తు పదార్థాల బారిన పడినవారికి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం ఈగల్ టీమ్ ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థుల్లో డ్రగ్స్ వినియోగాన్ని గుర్తించడానికి, నిరోధించడానికి పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో జిల్లా అంతటా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటి వద్ద విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించడానికి తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు, వ్యూహాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకర జీవన శైలిని అలవర్చుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌సీసీ మేనేజర్ వైవీసీకే రెడ్డి, సిబ్బంది సునిల్ కుమార్, విజయ్ కుమార్, అనిల్ కుమార్, ఈగల్ సెల్ సిబ్బంది ఫర్హాన్ ఖాన్, రమేష్, మాసూం వలి తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు..

కర్నూలు: మద్యం తాగడం మానుకోమని భార్య మందలించిందని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే... కల్లూరు మండలం ముజఫర్ నగర్ శివారులోని మద్దిరాజు నగర్‌లో నివాసముంటున్న తూర్పాటి పాపారాయుడు (43) సెంట్రింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈయనకు భార్య తూర్పాటి మనెమ్మతో పాటు ఈశ్వర్, రేవతి సంతానం. పిల్లలిద్దరూ చదువుకుంటున్నారు. పాపారాయుడు మద్యానికి బానిసై కొంతకాలంగా పనికి పోకుండా ఇంటి దగ్గరే ఉంటుండటం వల్ల సంసారం నడవటం కష్టంగా మారడమే కాక పిల్లల చదువులపై కూడా ప్రభావం పడింది. దీంతో మనెమ్మ భర్తను మందలించినందుకు ఈనెల 8వ తేదీన మద్యం మత్తులో భార్యను భయపెట్టాలనే ఉద్దేశంతో తాను తెచ్చుకున్న పురుగుల మందును నీళ్లలో కలుపుకుని సేవించాడు. కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక సోమ వారం ఉదయం మృతిచెందాడు. మద్యం తాగితే తాను గొడవ పడతానని నన్ను భయపెట్టేందుకు పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య మునెమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హాజిరా విద్యార్థులకు అభినందన


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న హాజిరా కాలేజీ ప్రిన్సిపాల్

కర్నూలు సిటీ: హాజిరా బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్మీడియేట్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించారు. ఈ నేపథ్యంలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఉస్మానియా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ సయ్యద్ నమీవుద్దీన్ ముజమ్మల్ అతిథిగా హాజరై ఇంటర్‌లో ఉత్తమ మార్కులు తెచ్చుకున్న విద్యార్థులను అభినందించి మాట్లాడారు. సరైన ప్రణాళికతో సమయాన్ని సద్వినియోగం చేసుకొని చదవడంతో హాజిరా విద్యార్థులు మంచి మార్కులు సాధించారన్నారు. హాజిరా కాలేజీ ప్రిన్సిపాల్ నజియా రహ్మత్ మాట్లాడుతూ సీనియర్ బైపీసీలో షేక్ జైబా, సీనియర్ ఎంపీసీలో అమీనా బేగం, సీనియర్ సీఈసీలో నశ్యాం అంజుమ్ మెహ్రా, హెచ్ఈసీలో పటాన్ మసియా ఖాతు అత్యుత్తమ మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు బషీరా బాను, కుందర్ ఇషావర్, ఆయేషా రాణి, నజియా హుస్సేన్, సయ్యదా గౌసియా అంజుమ్, తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించే ప్రజలకు సౌకర్యాలు కల్పించాలి


నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో నివసిస్తూ పన్నులు చెల్లిస్తున్న స్థానిక కాలనీ వాసులకు మౌళిక సదుపాయాలు కల్పించరా అని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లా రెడ్డి ప్రశ్నించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో కాలనీ వాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేపట్టడంలో మున్సిపల్ అధికారులు అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. నిధులు మంజూరై భూమిపూజ చేసి మార్కింగ్ చేసిన పనులు సైతం ప్రారంభించకుండా వాయిదా వేస్తున్నారన్నారు. గతంలో కర్నూలు నగరంలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితి లేదన్నారు. మంత్రి నియోజకవర్గంలోనే అభివృద్ధి కుంటుపడిందన్నారు. రహమత్‌నగర్, టీజీఎల్ కాలనీ, రిచ్‌మండ్ కాలనీలలో 15 వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అయినా పనులు మాత్రం జరగడంలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదవుతున్నా నగరంలో అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు యూసుఫ్, గౌడ్, అన్వర్ బాషా, నయూమ్, అబ్దుల్లా, శశికుమార్ రెడ్డి పాల్గొన్నారు.

బార్లీ పొగాకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని పత్తికొండ, కోడుమూరు, వెల్దుర్తి, కృష్ణగిరి, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం మండలాల్లో విస్తారంగా పండిన బార్లీ పొగాకును క్వింటాల్ రూ.18 వేల ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవరం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అన్నదాతలతో ఐటీసీ, జీపీఐ అలయన్స్ కంపెనీలు విస్తారంగా బార్లీ పొగాకు వేయించి క్వింటాల్ రూ.15వేల ప్రకారం కొనుగోలు చేస్తామని అగ్రిమెంట్ చేసుకున్నాయన్నారు. తీరా పంట పండిన తరువాత క్వింటాల్ రూ.4 వేల ప్రకారం అయితేనే కొనుగోలు చేస్తామని కంపెనీలు మొండికేస్తుండడంతో అన్నదాత దిగాలు చెందుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య పాల్గొన్నారు.

నేడు సీ క్యాంపు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): సి.క్యాంపు రైతుబజారులో పరిశుభ్రత పనులు చేపట్టాల్సి ఉండటంతో మంగళవారం బంద్ చేస్తున్నట్లు ఎస్టేటు అఫీసర్ కళ్యాణి, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.30వ తేదీ నుంచి యథావిధిగా రైతుబజారు పని చేస్తుందని వెల్లడించారు.

భవన కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సుధాకరప్ప భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై సోమవారం కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునురుద్ధరిస్తామని, నిధులు విడుదల చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే సంక్షేమ బోర్డుకు రూ. 4,298 కోట్లను కేటాయించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక భవన నిర్మాణ కార్మికులు పనులు లేకుండా పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ రంగానికి ఉపయోగించే స్టీలు, సిమెంట్, పెయింట్లు, టైల్స్‌పై జీఎస్టీ ఎత్తివేయాలని కోరారు. ధర్నా అనంతరం కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, ఏసు, రెహమాన్, నరేంద్ర, యేసు, గోపాలు, రవి, కిశోర్, కేశన్న పాల్గొన్నారు.

మే 15 లోపు పొగాకు కొనుగోలు చేయాలి


మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్) : మే 15వ తేది లోపు పొగాకు కొనుగోళ్లు చేయాలని జేసీ డాక్టర్ బి.నవ్య పొగాకు కంపెనీలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పొగాకు కొనుగోళ్లపై ఆమె వివిధ కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పొగాకును ధరలు తగ్గించి కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, అలా కాకుండా మంచి ధరను ఇవ్వాలని సూచించారు. పూర్తిగా పొగాకు పంటను మే 15 లోపు కొనుగోలు చేయాలని పొగాకు కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. ఓర్వకల్‌లో సిరి పొగాకును కొనుగోలు చేయాలని జీపీఐ కంపెనీని ఆదేశించారు. బీడీ పొగాకు, నాటురకం పొగాకును కూడా పూర్తిగా కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని ఐటీసీ, జీపీఐ, వీఎస్‌టీ, అలియన్స్, డెక్కాన్, టొబాకో, ఎస్ఎస్‌టీ, పీటీపీ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు.ఈ విషయంపై పొగాకు కంపెనీ ప్రతినిధులతో మరోక సమావేశం నిర్వహించి జిల్లాలో పండించిన పొగాకును పూర్తిగా, మంచి ధరలతో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని జేసీ చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, సహాచ వ్యవసాయ సంచాలకులు సాలురెడ్డి పాల్గొన్నారు.